● కుప్పం టు తమిళనాడు

జోరుగా ఇసుక అక్రమ రవాణా

కుప్పం మండలం పెద్దవంక కనకనాశమ్మ దేవాలయం చెక్‌డ్యామ్ నుంచి పెద్ద ఎత్తున ఇసుక తమిళనాడుకు అక్రమ రవాణా చేస్తున్నారు. చెక్‌డ్యామ్ తమిళనాడుకు సరిహద్దులుగా ఉండడం, తమిళనాడులో ఇసుకకు మంచి డిమాండ్ ఉండడంతో అక్రమార్కులు ఏకంగా జేసీబీలతో తవ్వి, టిప్పర్లలో తమిళనాడుకు ఇసుకను తరలిస్తున్నారు. అధికార పార్టీ నాయకులు అండదండలు పుష్కలంగా ఉండడంతో ఇప్పటికే వందలాది టిప్పర్ల లోడ్ల ఇసుక తమిళనాడుకు చేరినట్లు స్థానికులు చెబుతున్నారు.

- కనకనాశమ్మ దేవాలయం చెక్‌డ్యామ్ వద్ద ఇసుక దోపిడీ
- టిప్పర్లలో పెద్ద ఎత్తున రవాణా
- ఇసుకను దోచేస్తున్న తమిళ తంబీలు
- అక్రమ రవాణాకు అధికార పార్టీ నేతల అండదండలు

కుప్పం రూరల్: తమిళనాడు సరిహద్దుగా ఉండి ఆంధ్ర ప్రాంతానికి చెందిన కనకనాశమ్మ దేవాలయం చెక్‌డ్యామ్‌లో ఇసుక పుష్కలంగా ఉంది. అటవీ ప్రాంతంలో చెక్‌డ్యామ్ ఉండడంతో పై ప్రాంతాల నుంచి వర్షాలకు ఇసుక కొట్టుకువచ్చి చెక్‌డ్యామ్‌లో చేరడం పరిపాటి. దీంతో ఇక్కడ పెద్ద మొత్తంలో ఇసుక నిల్వలు ఉన్నాయి. దీనిపై కన్నేసిన తమిళ అక్రమ వ్యాపారులు జేసీబీలతో ఇసుకను తోడి, టిప్పర్లలో తమినాడుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత భారీగా ఇసుకను దోచుకుంటున్నా ప్రభుత్వం యంత్రాంగం చేష్టలుడిగి చూస్తోందని విమర్శలు వస్తున్నాయి. స్థానికులు ప్రశ్నిస్తే హంద్రీ–నీవా కాలువ పనులు అంటు పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు. పెద్ద ఎత్తున ఇసుక ఇలా దోచుకుంటున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. మరోవైపు ఇసుక రవాణాదారులకు అధికార పార్టీ నాయకులు అండదండలు ఉన్నట్టు సమాచారం. అంతేకాకుండా అధికార పార్టీ నాయకులు తమిళ వ్యాపారులతో చేతులు కలిపి ఇసుక నిక్షేపాలను కొల్లగొడుతున్నట్టు తెలుస్తోంది.


నీళ్లు ఉన్నప్పటికీ పాలారు చెక్‌డ్యామ్‌లో ఇసుకను తోడుతున్న జేసీబీ

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టండి


ఎమ్మెల్యేను కలిసిన సోమల ఎంపీపీ ఈశ్వరయ్య, మోహన్ తదితరులు


పెద్దిరెడ్డిని కలిసిన రొంపిచెర్ల మండల నాయకులు

పుంగనూరు/రొంపిచెర్ల: కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని, తద్వారా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పుంగనూరు ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పార్టీ శ్రేణులను ఆదేశించారు. గురువారం సోమల ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వర్‌రావు, వాటర్‌షెడ్ చైర్మన్ రాజారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కోటా వెంకటరమణ, రొంపిచెర్ల నాయకులు సైపుల్లాఖాన్, ముజీబ్, మస్తాన్, ఆనంద్, ఓబులేసు, సురేంద్రనాయుడు, సహదేవనాయుడు, నాగరాజ, చంద్రశేఖర్ నాయుడు తదితరులు ఎమ్మెల్యేను తిరుపతిలోని ఆయన స్వగృహంలో పరామర్శించారు. చేతికి శస్త్రచికిత్స అనంతరం ఆయన ఆరోగ్యం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే పైవిధంగా మార్గదర్శనం చేశారు.

వివాహ వేడుకల్లో పెద్దిరెడ్డి

చౌడేపల్లె: మండలంలోని కాగతి పంచాయతీ యనమచామనపల్లెలో గిరినాథ్‌రెడ్డి, గౌతమి వివాహ రిసెప్షన్ వేడుకల్లో గురువారం ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరై నవ వధూవరులను ఆశీర్వదించారు. జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, మాజీ ఎంపీపీలు అంజిబాబు, రుక్మిణమ్మ, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చని కూటమి ప్రభుత్వం

- అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ప్రేమ విమర్శ


కార్యకర్తలతో కలసి మాట్లాడుతున్న ప్రేమ

రొంపిచెర్ల: అధికారంలోకి వచ్చాక ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చడం లేదని చిత్తూరు జిల్లా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ప్రేమ విమర్శించారు. అంగన్‌వాడీ వర్కర్లకు ఇచ్చిన హామీని ఇకనైనా నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గురువారం రొంపిచెర్లలో పులిచెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని రొంపిచెర్ల, పులిచెర్ల, సదుం మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, అధికారంలోకి వస్తే తాము అంగన్‌వాడీ కార్మికులకు కనీస వేతనాలు ఇస్తామని నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి 10 నెలలవుతున్నా తమ గురించి పట్టించుకోవడం లేదన్నారు. పని భారం తగ్గించి నాణ్యత గల సెల్ ఫోన్లు ఇవ్వాలని, అర్హత ఉన్న మినీ అంగన్‌వాడీ కార్యకర్తలను మెయిన్ అంగన్‌వాడీలుగా గుర్తించాలన్నారు. అంగన్‌వాడీలకు ప్రతి నెలా 5వ తేదికి జీతాలు చెల్లించాలన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని టేక్ హోమ్ రేషన్ తో మే నెల వేసవి సెలవులు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యం, కందిపప్పు, కోడిగుడ్లు, పాలను 1వ తేదికి చేర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, అంగన్‌వాడీ ఏఐటీయూసీ యూనియన్ నాయకులు అరుణ, సరస్వతి, మోబిన్ తాజ్‌బేగం, అలివేలు, గీత, శశికళ, ధనలక్ష్మి, సుజాత, ఈశ్వరి, రమణమ్మ, అమృత, ఈశ్వరి, లతా, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

కిరణ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎన్ నాగరాజు ఫిర్యాదు


వి.కోట పోలీస్ స్టేషన్ సీఐకు చేసిన ఫిర్యాదును చూపుతున్న పీఎన్ నాగరాజు

వి.కోట : ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఆయన సతీమణి భారతీరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎన్ నాగరాజు వి.కోట పోలీస్‌స్టేషన్‌లో గురువారం రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినుకొండకు చెందిన చేబ్రోలు కిరణ్ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఆయన సతీమణిపై అత్యంత నీచమైన భాషలో, అన్ పార్లమెంటరీ పదాలతో దూషించి అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని రాతపూర్వకంగా స్థానిక సీఐ సోమశేఖర్‌రెడ్డికి ఫిర్యాదు చేశానని తెలిపారు. ఆయనతో పాటు ఎంపీటీసీ సభ్యుడు పత్రపల్లి చలపతి, వార్డు సభ్యుడు కుమార్‌రాజా, నాయకులు పూల నాగ, కృష్ణ ఉన్నారు.

వైఎస్సార్ సీపీ మద్దతుదారుల నిర్మాణాల తొలగింపు యత్నం


నిర్మాణాలు తొలగించేందుకు జేసీబీతో వచ్చిన రెవెన్యూ అధికారులు

కుప్పం రూరల్: కుప్పం మండలం, వెండుగంపల్లెలో జాతీయ రహదారికి పక్కన వైఎస్సార్ సీపీ మద్దతుదారుడు వేసుకున్న షెడ్డును గురువారం రెవెన్యూ అధికారులు తొలగించేందుకు యత్నించారు. ఇప్పటికే గ్రామస్తులు కొంతమంది జాతీయ రహదారికి ఆనుకుని నిర్మాణాలు చేసుకున్నారని, తాము తమ స్థలంలో షెడ్డు నిర్మించుకున్నట్టు వెండుగంపల్లె వైస్ సర్పంచ్, వైఎస్సార్ సీపీ మద్దతుదారు మునెప్ప చెప్పారు. కానీ రెవెన్యూ అధికారులు జాతీయ రహదారి స్థలంలో నిర్మాణాలు చేసుకున్నారని, నిర్మాణాలను కూల్చేందుకు జేసీబీతో గురువారం అక్కడకు చేరుకున్నారు. ఎంత చెప్పినా అధికారులు వినకపోవడంతో తామే తొలగిస్తామని మునెప్ప చెప్పడంతో అక్కడి నుంచి అధికారులు వెనుదిరిగారు. ఇప్పటికే కొంత మంది జాతీయ రహదారికి అనుకుని నిర్మాణాలు చేసుకున్నారని, వారెవరినీ ప్రశ్నించక తమను మాత్రం నిర్మాణాలు తొలగించాలని రావడం శోచనీయమని మునెప్ప ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము వైఎస్సార్ సీపీ మద్దతుదారులం కావడంతో కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.. దీనిపై రెవెన్యూ అధికారుల వివరణ కోరగా.. మునెప్ప షెడ్డు నిర్మాణ స్థలం జాతీయ రహదారికి చెందినదని, ఆయనకు అనుమానాలు ఉంటే సర్వే చేయించుకోవాలన్నారు.

ప్రకృతి సేద్యంతో నాణ్యమైన ఆహారోత్పత్తులు


సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

గుడుపల్లె: రాబోవు ఖరీఫ్ సీజన్‌లో రైతులు ప్రకృతి సేద్యంపై దృష్టి పెట్టాలని రాష్ట్ర ఎస్ఆర్ ఐటిమిటిక్ లీడ్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం స్థానిక శ్రీశక్తి భవనంలో మండల స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం చేయడం వల్లభూమి సారవంతంగా కావడంతో పాటు పెట్టుబడుల ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. ప్రజలకు నాణ్యమైన ఆహారోత్పత్తులు అందించే దిశగా రైతులు సేంద్రియ వ్యవసాయం చేయాలని కోరారు. సొంతంగా ఎరువులను తయారు చేసుకుని పొలాలను రెండు మూడుసార్లు దున్ని దుక్కి చేసుకోవాలన్నారు. పొలంలో పంట పంటకి రెండు నెలల విరామంతో పంటలు సాగు చేయాలన్నారు. పంటలకు సేంద్రియ ఎరువులు, కషాయాల వాడకం వైపు మొగ్గు చూపి రసాయన ఎరువుల వాడకానికి స్వస్తి పలకాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు నాగరాజు, అమృత, ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్‌లు మునిక్రిష్ణ, శ్రీదేవి, భారతి, రూప, విజయ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

సీతారామాంజనేయుని ఊరేగింపు


పట్టణంలో ఊరేగుతున్న సీతారామాంజనేయులు

పలమనేరు: పట్టణంలో పాతపేట పెద్దగాండ్ల వీధిలోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నవమి వేడుకల్లో భాగంగా గురువారం రాత్రి స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి, పట్టణంలో ఊరేగించారు. దారి పొడవునా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రాజేంద్రన్, ఉభయదారులు టీకే షణ్ముగం, భక్తులు పాల్గొన్నారు.

- రూ.50 లక్షల అభివృద్ధి పనుల అడ్డగింపుపై ఆగ్రహం
- పనులు చేయాలంటే ఎంపీడీఓకు 2శాతం కమీషన్..!
- ఎంపీపీకి తెలియకనే వారి గ్రామంలో బోరు డ్రిల్లింగ్!
- చులకనగా చూస్తే తగిన మూల్యం చెల్లించతప్పదని ఎంపీడీఓకు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధుల హెచ్చరిక

ఎంపీడీఓపై సభ్యుల ధ్వజం


ఎంపీడీఓ తీరుపై మండిపడుతున్న సభ్యులు

గంగవరం: అభివృద్ధి పనులకు ఎంపీడీఓ కమీషన్ డిమాండ్ చేస్తున్నారని, ఇది ఎంతమాత్రమూ సహేతుకం కాదని ఎంపీడీఓపై మండల ప్రజాప్రతినిధులు నిప్పులు చెరిగారు. ఎంపీపీ వెంకట్రమణ అధ్యక్షతన గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. బుధవారం కోరం లేకపోవడంతో మండల సమావేశం గురువారానికి వాయిదా వేశారు. సమావేశం మొదలుకాగానే అజెండాకు ముందుగానే ఎంపీపీ, జెడ్పీటీసీతోపాటు సభ్యులంతా కలిసి ఎంపీడీఓ తీరుపై ధ్వజమెత్తారు. గతంలో సాధరణ నిధులు రూ.50లక్షలతో చేపట్టాల్సిన పనులు ఎందుకు వర్క్ ఆర్డర్ ఇవ్వలేదని సూటిగా ఆయన్ను ప్రశ్నించారు. దీనికి ఎంపీడీఓ సరైన సమాధానం ఇవ్వకుండా దాటవేసేందుకు యత్నించారు. మరోవైపు సభ్యులు మాట్లాడుతూ, పనులు చేయాలంటే మీకు రెండు శాతం కమీషన్ ఎందుకివ్వాలంటూ గట్టిగా నిలదీశారు. దీనికి ఆయన నుంచి సమాధానం లేకుండా పోయింది. 15వ ఆర్థిక సంఘ నిధులు దాదాపు రూ.76లక్షలు ఏమయ్యాయని సభ్యులు ప్రశ్నించారు. ఈ నిధులతో మండలంలోని పలు చోట్ల బోర్లు, అభివృద్ధి పనులు చేసినట్లు ఎంపీడీఓ బదులిచ్చారు. అయితే తమకు తెలియకుండా ఎక్కడెక్కడ అభివృద్ధి పనులు చేశారో చెప్పాలని తీవ్ర స్థాయిలో నిలదీయడంతో ఆయన సరైన సమాధానం ఇవ్వలేదు. కలగటూరులో ఉన్న బోరునే రీ–బోర్ చేశారని ఎంపీటీసీ సభ్యురాలు భారతి సమావేశంలో ప్రస్తావించగా, అది కొత్తబోరని అధికారులు చెప్పడం సభ్యులకు మరింత అనుమానాన్ని తెప్పించింది.

ఎంపీపీ అంటే చిన్నచూపేలా..?

గత జనవరిలో నిర్వహించిన మండల సమావేశానికి సంబంధించి తనకు అసలు సమాచారం ఇవ్వకుండా తన ఇంటికే నోటీస్ అంటించడం, తాను దళిత ఎంపీపీ కాబట్టే ఎంపీడీఓ సముచితమైన గౌరవం ఇవ్వడం లేదని ఎంపీపీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అలాగే, సభ్యులు సైతం ఆయనకు మద్దతుగా మాట్లాడారు. అసలు ఎంపీపీ స్వగ్రామంలోనే ఆయన సమాచారం లేకుండా బోరు డ్రిల్లు చేశారని.. ఇదెక్కడి న్యాయమని ఎంపీడీఓను ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేశారు. ఎంపీడీఓకు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులంటే ఏమాత్రం గౌరవం లేకుండా వ్యవహరిస్తున్నారని, దీనికి మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో జెడ్పీటీసీ పార్వతి, వైస్ ఎంపీపీలు ఉమాదేవి, ఆదంబాషా, సర్పంచులు భాస్కర్ రెడ్డి, గిరిరాజారెడ్డి, రమణ, ఎంపీటీసీలు నాగేంద్ర తదితరులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నందిపై సోమేశ్వరుడు

పుంగనూరు: పట్టణంలో నగిరివీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో గురువారం స్వామి వారు నంది వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తొలుత ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు షణ్ముక దీక్షితులు అభిషేకాలు, హోమాలు నిర్వహించారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

పుంగనూరు: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఉద్యోగులు, కార్మికులు ధర్నా చేశారు. దీనికి నేతృత్వం వహించిన జిల్లా ఎన్ఎంయు అధ్యక్షుడు వేలు, కార్యదర్శి భాస్కర్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. 1/2019 సర్క్యులర్‌ను తక్షణమే అమలు చేయాలన్నారు. అనంతరం తమ డిమాండ్లపై డీఎం సుధాకరయ్యకు వినతి పత్రం సమర్పించారు. శంకరయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి


మంగళం కాలనీలో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

పుంగనూరు: బాలింతలు తమ ఆరోగ్యం విషయంలో శ్రద్ధ వహించాలని లేనిపోంలో తల్లి, పిల్లలు అనారోగ్యం బారిన పడే అవకాశాలు ఉన్నాయని ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఆయిషా నస్రీన్‌తాజ్ అన్నారు. గురువారం మంగళం కాలనీలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. తల్లులు, పిల్లలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గర్భం దాల్చిననట్లు నిర్ధారణ అయినప్పటి నుంచి ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆహార నియమాలు పాటిస్తూ, పౌష్టికహారాన్ని తీసుకోవాలన్నారు.

గజ వాహనం సమర్పణ


గజవాహనాన్ని సమర్పిస్తున్న పుష్పావతమ్మ, అశ్వర్థ నారాయణజెట్టి

పుంగనూరు: పట్టణంలో నగిరివీధిలోని ప్రసన్న పార్వతీదేవి సమేత సోమేశ్వరస్వామికి గురువారం పట్టణానికి చెందిన పుష్పావతమ్మ, అశ్వర్థ నారాయణజెట్టి పంచలోహాలతో తయారు చేసిన గజ వాహనాన్ని సమర్పించారు. దీని విలువ సుమారు రూ.2.50లక్షలని తెలిపారు. దీనిని ఆలయ అర్చకులు షణ్ముక దీక్షితులు, కమిటీ సభ్యులకు అందజేశారు. వాహనానికి ప్రత్యేక పూజలు చేశారు. దాత కుటుంబ సభ్యులకు ఆశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

బైరెడ్డిపల్లె: మండలంలోని నాగిరెడ్డిపల్లె–టీఎన్ కుప్పం గ్రామాల మధ్య ఉన్న సోమేశ్వరస్వామి ఆలయంలో గురువారం బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామి వారికి అభిషేకం, గంగపూజ, గణపతి పూజ, అంకురార్పణ తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

జాబ్‌మేళా రిజిస్ట్రేషన్


నిరుద్యోగులతో మాట్లాడుతున్న ఏపీఎం, సిబ్బంది

చౌడేపల్లె: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని వెలుగు కార్యాలయంలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళా రిజిస్ట్రేషన్‌కు 53 మంది హాజరయ్యారని ఏపీఎం సుబ్రమణ్యం తెలిపారు. సి–డాప్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ మేళాకు హాజరైన నిరుద్యోగుల్లో 13 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో జాబ్స్ ట్రైనర్ లోకేష్, జాబ్స్ కో–ఆర్డినేటర్ రెడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం

పలమనేరు: ఇటీవల కరెంట్ స్తంభంపై నుంచి పడి వెన్నెముక దెబ్బతిని వేలూరు సీఎంసీలో సరమట్లపల్లెకు చెందిన ట్రాన్స్‌కో షిఫ్ట్ ఆపరేటర్ అశోక్‌కుమార్ చికిత్స పొందుతున్నాడు. అతడి కుటుంబ పరిస్థితి తెలుసుకుని చికిత్స నిమిత్తం మండలంలోని మొరం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అశోక్ ఆలమట్టి గురువారం రూ.14,400 సాయం చేశారు.

ముగ్గురికి ఉద్యోగోన్నతి



గాయత్రి, వేంకటేశ్వరి

రొంపిచెర్ల: రొంపిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పనిచేస్తున్న ముగ్గురు గ్రేడ్–3 ఏఎన్ఎంలకు ఉద్యోగోన్నతి పొందారని పీహెచ్‌సీ డాక్టర్ దినేష్ కుమార్ నాయక్ గురువారం తెలిపారు. గ్రామ సచివాలయాల్లో గ్రేడ్ –3 ఏఎన్ఎంలుగా పని చేస్తున్న గాయత్రి, సుజాత, వేంకటేశ్వరికి గ్రేడ్–2 ఏఎన్ఎంలుగా ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారు.

నోటీస్ బోర్డు

● పూలే జయంతి జయప్రదం చేయండి జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట : బడుగుల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలను జయప్రదం చేయాలని గురువారం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న జ్యోతిబా పూలే జయంతి వేడుకలకు బీసీ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

● పలమనేరులో..

పలమనేరు: పట్టణంలోని టవర్ క్లాక్ వద్ద మహాత్మ జ్యోతిబా పూలే జయంతి వేడుకలను శుక్రవారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్నట్టు స్థానిక బీసీ ఫ్రంట్ నేత గోవిందస్వామి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

● 21న మోడల్ స్కూల్ ఎంట్రన్స్ పరీక్ష

పుంగనూరు: మండలంలో అడవినాథునికుంటలోని మోడల్ స్కూల్‌లో 6వ తరగతి అడ్మిషన్లకుగాను ఎంట్రన్స్ పరీక్షను ఈనెల 21న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రమ గురువారం తెలిపారు. 20న నిర్వహించనున్న పరీక్షను ప్రభుత్వం 21వ తేదీకి మార్చినట్టు చెప్పారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో తీసుకోవాలన్నారు. వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం



పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లెలో ప్రయాణికుల సౌకర్యార్థం సర్పంచ్ గోవిందుస్వామి గురువారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బాటసారులు, ప్రయాణికుల సౌకర్యార్థం దీనిని ప్రారంభించినట్లు చెప్పారు. చలివేంద్రాన్ని ఎంపీడీఓ ఖాదర్‌బాషా, పంచాయతీ సిబ్బందితో కలిసి ప్రారంభించారు.

అర్ధగిరికి రూ.22.75 లక్షల ఆదాయం

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానానికి షాపింగ్ కాంప్లెక్స్‌ల ద్వారా రూ.22.75 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ హనుమంతరావు తెలిపారు. గురువారం అర్ధగిరిలో 10 షాపులకు వేలం నిర్వహించారు.

ఆర్టీసీ సర్వీసును ప్రారంభించిన ఎమ్మెల్యే


తీర్థంలో ఆర్టీసీ బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

బైరెడ్డిపల్లె: పలమనేరు ఆర్టీసీ డిపో దాసార్లపల్లె సర్వీసును గురువారం ఎమ్మెల్యే ఎన్.అమరనాథరెడ్డి ప్రారంభించారు. గతంలో పలమనేరు నుంచి బైరెడ్డిపల్లె, తీర్థం మీదుగా దాసార్లపల్లెకు ఆర్టీసీ బస్సులు నడిచేవి. అయితే ఆటోలు విపరీతంగా ఉండటం, రహదారి గుంతలమయం కావడంతో ఆర్టీసీ సర్వీసులు నిలిచిపోయాయి. గత ప్రభుత్వం హయాంలో దాసార్లపల్లె వరకు రహదారి విస్తరణ పనులు చేశారు. ఈ నేపథ్యంలో నిలిచిన ఆర్టీసీ సర్వీసులను పునరుద్ధరించాలని ప్రజలు ఎమ్మెల్యేను కోరడంతో ఆయన పలమనేరు ఆర్టీసీ డిపో మేనేజర్‌తో మాట్లాడారు. దీంతో గురువారం తీర్థంలో ఆర్టీసీ సర్వీసును ప్రారంభించారు. అలాగే తీర్థంలో స్వంత స్థలం కలిగిన 130 లబ్ధిదారులకు ఇంటి పట్టాలు మంజూరు చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ స్వామి, అసిస్టెంట్ మేనేజర్ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ మాధవరాజు, వీఆర్‌ఓలు గురివిరెడ్డి, శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం శెట్టి పాల్గొన్నారు.

పలమనేరులో కరాటే శిక్షణ కేంద్రం..

పలమనేరు: పట్టణంలో గురువారం మార్షల్ ఆర్ట్స్ సెంటర్‌ను స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి గురువారం ప్రారంభించారు. పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి ఆత్మరక్షణ విద్యలైన కరాటే ఒక సాధనంగా తోడ్పడుతుందన్నారు. అనంతరం కరాటే క్రీడాకారులు ప్రదర్శించిన విన్యాసాలను ఆసక్తిగా తిలకించారు.

కోర్టుకు హాజరైన పలమనేరు ఎమ్మెల్యే

పలమనేరు: పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి గురువారం స్థానిక కోర్టుకు హాజరయ్యారు. గత ప్రభుత్వం హయాంలో బైరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్ వద్ద అనుమతి లేకుండా ధర్నా చేసిన కేసుకు సంబంధించి ఆయన కోర్టుకు హాజరైనట్టు తెలిసింది.